తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శుక్రవారం
15 ఆగస్టు 2025
పేజీలు : 10
Follow :




# పార్ట్‌టైమ్ ఉద్యోగాల.. భారీ మోసాలు

- బలవన్మరణాలకు పాల్పడుతున్న బాధితులు
- లోన్‌యాప్‌ల కట్టడి పట్ల పోలీసుల విఫలం
- ఖాతాదారుల అరెస్ట్‌తో సరిపెట్టేస్తున్న వైనం
- సూత్రధారుల కోసం కనీస ప్రయత్నాలు నిల్

**వనపర్తి, ఆగష్టు 14 (జనంసాక్షి) :**
సరైన సంపాదన వనరులు లేక ఏవైనా పనులు చేసుకుందామని ప్రయత్నిస్తున్న నిరుద్యోగుల పాలిట యమకూపాలుగా మారుతున్నాయి పార్ట్ టైమ్ ఉద్యోగాల ప్రకటనలు. ఇంట్లో ఖాళీగా ఉన్నామని ఒకరు.. పనిచేసే ఉద్యోగంతో వచ్చే సంపాదన కుటుంబ పోషణకు సరిపోక మరొకరు, ఏదో ఒకటి అదనంగా పనిచేసి ఇలా పార్ట్‌టైమ్ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారిని టార్గెట్‌గా చేసుకొని సైబర్‌నేరగాళ్లు పేరున్న కంపెనీల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలంటూ సోషల్ మీడియా ద్వారా ప్రకటనలు ఇవ్వడం, సెల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపిస్తూ వారిని బుట్టలో *మిగతా 2లో..*



# జలమయంగా జడ్చర్ల

- చెరువులను తలపించిన పట్టణ రోడ్లు..
- సహాయక చర్యల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి..
- సహాయక చర్యలు చేపట్టిన పోలీస్, మున్సిపల్ సిబ్బంది..

**జడ్చర్ల, ఆగస్టు 14 (జనంసాక్షి):**
జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లు మొత్తం చెరువులను తలపించాయి. కావేరమ్మపేట నల్లచెరువు మినీ ట్యాంక్ బండ్ నిండి అలుగు వస్తుండడంతో గురువారం పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద రెండు బస్సులు వరద నీటిలో చిక్కుకున్నాయి. సర్వీస్ రోడ్డు గుండా హైదరాబాద్ వెళ్తున్న బస్సులోకి వరద నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, పోలీసులు సిబ్బంది హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకొని రెండు బస్సులలో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. *మిగతా 9లో..*





# 'స్వతంత్ర' వేడుకలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో స్వతంత్ర వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. రానున్న 24 గంటలలో బారి వర్షాలు ఉన్నందున స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఏర్పాట్లను చేయాలని, పరేడ్ మైదానంలో సాయుధ పోలీసుల కవాతును బాగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. వేడుకలను తిలకించడానికి వచ్చే అతిథులకు, విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయాలని, స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎస్. శ్రీను, అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, ఆర్.డి.ఓ. రాంచందర్, డి.ఎస్.పి. సిలిం సిఐ శివ శంకర్, ఆర్ నరసింహ, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరద ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి)**
ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగిపొర్లుతు న్నాయి. ఈ క్రమంలో గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి చిట్యాల వాగు నల్లచెరువు అలుగులను సందర్శించి పరిశీలించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని వనపర్తి రెడ్ జోన్‌గా పరిగణించారన్నారు. ఈ క్రమంలో ప్రజలు అత్యవసర సమయాలలోనే ప్రయాణాలు చేయాలని, మరో రెండు రోజులు అప్రపంతంగా ఉండాలని ఎమ్మెల్యే సూచిం చారు. అత్యవసర సమయాల్లో ఎలాంటి అవసరం ఉన్న తన నెంబర్కు కాల్ చేయాల ని 9494216666,అదేవిధంగా కలెక్టర్ కార్యాలయంలోనూ కంట్రోల్ రూమ్‌ఏర్పాటు చేశామని సంప్రదించగలరని ఆయన సూచించారు. నాయకులు కార్యకర్తలు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పార్ట్‌టైమ్ ఉద్యోగాల భారీ మోసాలు



వేస్తూ నిండా ముం చేస్తున్నారు. ఇలా ఆన్‌లైన్ మోసాల బారినపడి మోసపోతున్న బాధితులు తమ కష్టార్జితం నేరగాళ్ల పాలుకావడంతో తట్టుకోలేక ఆత్మహత్యల వైపు చూస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది.

**నిర్వాహకుల వేధింపులు తట్టకోలేక**

నేడు సైబర్‌నేరగాళ్లను కట్టడి చేయడంలో తెలంగాణ పోలీసులు చేతులెత్తేశారా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మూడేండ్ల కింద అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇలాంటి ఘటనలు జరిగితే పోలీసులు వెంటనే చర్యలు తీసుకుంటూ సైబర్‌నేరగాళ్లపై ఉక్కుపాదం మోపిన ఘటనలున్నాయి. లోన్‌యాప్‌ల నిర్వాహకుల వేధింపులకు తట్టకోలేక బాధితులు బలవన్మరణం పాల్పడటంతో లోన్‌యాప్‌ల నిర్వాహకులు, కాల్ సెంటర్లు, కార్యాలయాలపై దేశ వ్యాప్తంగా దాడులు చేసి నేరాలను కట్టడి చేశారు. ఒక పక్క నేరస్తుల కట్టడి.. మరో పక్క ప్రజల్లో పేరు.. ఊరు లేని లోన్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకోవద్దని అవగాహన కల్పించారు. అంతకు ముందు కలర్ ప్రిడిక్షన్ గేమ్‌తో అమాయకులకు వల వేసి కోట్లను కొల్లగొట్టిన సైబర్‌నేరగాళ్ల ఆటను సైతం తెలంగాణ పోలీసులు కట్టడి చేశారు.

**రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు..**

పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో ప్రస్తుతం ప్రతిరోజు రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయలు సైబర్‌నేరగాళు కొట్టేస్తున్నారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతుండటంతో అందుకు తగ్గట్టుగా వాటిని కట్టడి చేసేందుకు ప్రత్యేక వ్యవస్థలను సైతం ఏర్పాటు చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోతోపాటు ఆయా కమిషనరేట్ల పరిధిలోని సైబర్‌నేరాల దర్యాప్తునకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయినా సైబర్‌నేరాలను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమవుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పోలీసులకు చిక్కకుండా..**

ప్రస్తుతం జరుగుతున్న పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్టాక్‌మార్కెట్ పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్‌లకు సంబంధించిన మోసాల్లో ఉద్యోగాలంటూ ఆశ పెడుతూ నేరగాళ్లు మోసం చేస్తుండగా, స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు అనగానే ఆశకు పోయి బాధితులు భారీగా డబ్బు పోగొట్టుకుంటున్నారు. డిజిటల్ అరెస్ట్‌లలో పోలీసులు పేరు చెప్పి బెదిరిస్తుండటంతో చాలా మంది భయాందోళనకు గురవుతూ నేరగాళ్ల ట్రాప్‌లో చిక్కుకుంటున్నారు. ఇలాంటి మోసాల సూత్రధారులు ఇతర దేశాల్లో ఉంటుండగా, వారికి సహకరించే వారు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉంటున్నారు. ఇతర దేశాల్లో ఉండే సూత్రధారులను పట్టుకురావడం కష్టమైన పని కావడంతో పోలీసులు సైతం తామేమీ చేస్తామని చేతులెత్తేసే పరిస్థితికి వచ్చారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైబర్‌నేరాలకు బ్యాంకింగ్‌తో దగ్గరి సంబంధాలున్నాయి. నేరగాళ్ల సూచన మేరకు బాధితుడు డబ్బంతా వివిధ బ్యాంకు ఖాతాల్లోనే డిపాజిట్ చేస్తున్నారు. దీంతో బ్యాంకింగ్ విభాగాన్ని కట్టుదిట్టం చేస్తే చాలా వరకు సైబర్‌నేరాలు కట్టడి చేసే అవకాశముంటుంది. బ్యాంకు ఖాతాలు నేరగాళ్ల చేతికి చిక్కకుండా కట్టుదిట్టమైన ప్రణాళికలను అమలు చేయాల్సి ఉన్నా ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి.

**ఖాతాదారుల అరెస్ట్ సరే..! సూత్రధారులేరీ..?**

గతంలో తరచూ సైబర్‌క్రైమ్ బృందాలు ఇతర రాష్ట్రాల్లో నేరగాళ్ల కోసం గాలింపు చేస్తూ కీలక నిందితులను పట్టుకునేవారు. నేడు ఎప్పుడో ఓ సారి బృందాలు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నాయి. బాధితులు ఇక్కడుంటుండగా, నేరస్తులు ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ఉంటున్నారు. నేరం చేసినవాడు ఇక్కడి నుంచి మేము వెళ్లే సరికే ఫోన్ నంబర్‌తోపాటు నివాసాన్ని మార్చేస్తాడు. చివరకు బ్యాంకు ఖాతాదారులను పట్టుకొని తాము ఆయా కేసుల్లో నిందితులను అరెస్ట్ చేశామని చెప్పుకొంటున్నారు.ఆయా రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ నేరగాళ్లను పట్టుకుంటున్నామని చెబుతున్నా, అది కూడా అంతంత మాత్రమే కొనసాగుతుండటం గమనార్హం. కాగా, వివిధ రాష్ట్రాల్లో అమాయకుల నుంచి బ్యాంకు ఖాతాలను కమీషన్ పద్ధతిలో కొన్నిసార్లు, మరికొన్ని సార్లు ఒకేసారి కొంత డబ్బు ఇచ్చి సైబర్ నేరగాళ్ల ముఠాలు బ్యాంకు ఖాతాలను తీసుకొని వాడుకోవడం చేస్తున్నారు. తమ బ్యాంకు ఖాతాలను నేరాలకు వాడుతున్నారని కొందరికి తెలిసినా, మరికొందరికి తెలియదు. ఈ బ్యాంకు ఖాతాదారులే చివరకు పోలీసులకు చిక్కుతున్నారు. బ్యాంకు ఖాతాదారులను పట్టుకొని మేం ఫలానా కేసులో నిందితులను అరెస్ట్ చేశామంటూ పోలీసులు చెప్పుకొంటున్నారు. నేరాలను కట్టడి చేసేందుకు తూతూ మంత్రపు చర్యలు కాకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఈ నేరాలను అదుపు చేసేందుకు తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్లాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

# ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**మక్తల్, ఆగస్టు 13 (జనంసాక్షి)**

మక్తల్ నియోజక వర్గ కేంద్రంలోని ప్రభుత్వ సీహెచ్‌సీని గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ప్రసూతి గది, స్కానింగ్, ల్యాబ్, దయాలసిస్ సెంటర్, జనరల్ వార్డు, డ్రగ్స్ స్టోర్‌ను ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ల్యాబ్ కు వెళ్లిన కలెక్టర్ అక్కడ రోజుకు ఎన్ని రక్త పరీక్షలు, ఎలాంటి పరీక్షలు చేస్తు న్నారని, టీబీ నిర్ధారణ పరీక్షలు ఎంత మందికి చేస్తున్నారని, టీబీ కోసం సేకరించిన నమూనాలకు ఎక్కడ స్టోర్ చేస్తున్నారని, చేసిన పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. దయాలసిస్ సెంటర్‌లోకి వెళ్ళి ఎన్ని బెడ్స్ ఉన్నాయని, ఎంతమంది దయాలసిస్ చేసుకుంటున్నారనే వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేయించాలని, మరుగు దొడ్ల తలుపులను మరమ్మతు చేయించాలని మున్సిపల్ కమిషనర్ శంకర్ కు సూచించారు. అనంతరం జనరల్ వార్డుకి వెళ్ళి రోగులతో వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఓపీ విభాగానికి వెళ్లి రోజుకు ఎంత మంది అవుట్ పేషంట్స్ వస్తుంటారని అక్కడి వైద్య సిబ్బందిని ప్రశ్నించగా 200 నుంచి 300 మంది దాకా అవుట్ పేషంట్స్ వస్తుంటారని సిబ్బంది



కలెక్టర్ కు తెలిపారు. ఆస్పత్రిలో నమోదు అవుతున్న సీజనల్ వ్యాధుల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ కేసులేమీ లేవు కదా అని ప్రశ్నించగా ఇప్పటి దాకా వైరల్ ఫీవర్ కేసులే ఎక్కువగా నమోదు అయ్యాయని సిబ్బంది తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం అన్నారు. చివరగా డ్రగ్స్ స్టోర్‌కి వెళ్ళి నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. డ్రగ్స్ కాల పరిమితి ఎలా తెలుస్తుందని డ్రగ్స్ స్టోర్ ఫార్మాసిస్టును అడగడంతో డ్రగ్స్ వచ్చినప్పుడు తాము రిజిస్టర్‌తో పాటు కంప్యూటర్‌లోనూ నమోదు చేస్తామని, మందుల నిల్వను బట్టి కాల పరిమితి ముగిసిన వాటిని ఎప్పటిక ప్పుడు పరిశీలిస్తామని ఫార్మాసిస్టు కలెక్టర్‌కు తెలిపారు.

## పాఠశాలాల్లో పారిశుద్ధ్యంపై నోటీసులు జారీ



**రాజాపూర్, ఆగస్టు 13 (జనంసాక్షి) :**

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం, భవిత సెంటర్, కుచ్చర్ కల్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ చేసిన మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ రాజాపూర్ భవితా సెంటర్, ప్రాథమిక పాఠశాలలో పరిశుభ్రతపై షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు సమాచారం. డీఇఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ వెంకట్ రములు, ఉన్నారు.

## దాసర్ దొడ్డిలో టిబి ముక్త్ భారత్ క్యాంప్

**మక్తల్, ఆగస్టు 14 (జనంసాక్షి) :**

మండలంలోని దాసర్ దొడ్డి గ్రామంలో కర్ని పీహెచ్ సీ, చందాపూర్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ తోపాటు ఎక్స్ రే పరీక్షలు అవసరమైన వారికి ప్రభుత్వ వాహనంలో తరలించి జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వినోద్, డాక్టర్ హబీబ్, డాక్టర్ సమీనా, డాక్టర్ నవీన, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, సిబ్బంది కేశవ్, ఏఎన్ఎం పద్మావతి, ఆండాలమ్మ, వేదవతి, మునియమ్మ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**సిపిఐ తాలూకా ప్రధాన కార్యదర్శి పెరుముల గోపాల్**



**అచ్చంపేట ఆగస్టు 14 (జనం సాక్షి)**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 4వ రాష్ట్ర మహాసభలు మేడ్చల్ జిల్లా గాజుల రామాయణం షాపూర్ నగర్ కుత్బుల్లాపూర్ మండలంలో జరుగును సిపిఐ రాష్ట్ర మహా సభలు జయప్రదం చేయాలని అచ్చంపేట నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం ఈ మహాసభల గోడ వాల్ పోస్టర్ పోస్టర్ను అచ్చంపేట తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశన్న యాదవ్ ఐఎన్‌టియుసి అధ్యక్షులు మహబూబ్ అలీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరటి నరేష్, కార్మిక నాయకులు హుస్సేన్, కాషాయ బురాన్ చాన్ పాషా, వారలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి



**- మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ**

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర నేత ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**

**ఉర్కొండ ఆగస్టు 14, (జనం సాక్షి)**

దేశ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరిం చుకొని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని బిజెపి మండల అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి యువకుడు దేశభక్తిని కలిగి ఉండాలని ,ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని ,జడ్చర్ల నియోజకవర్గ ప్రజలకు 79వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పాలమూరు జిల్లా కౌన్సిల్ నెంబర్ ముచ్చర్ల లక్ష్మారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి, మండల నాయకులు పరుశురాం, బ్రహ్మాచారి, తుప్పల వెంకటేష్, శివ రేపని శ్రీను, కొమ్ము శ్రీను,నీలకంఠేశ్వర్ రెడ్డి, సందీప్ కుమార్,లక్ష్మణ్ గౌడ్, వేణు నాయక్, రచకొండ గోపి, ఆంజనేయులు, మల్లేష్, వెంకట బాల రామయ్య హై స్కూల్ విద్యార్థులు, రెయిన్బో చిల్డ్రన్స్ స్కూల్, ప్రభు త్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ప్రహారి గోడ దాటిన వరద నీరు



**నర్వ ఆగస్టు 14 (జనంసాక్షి):**
నర్వ మండల పరిధిలో శ్రీపూరం గ్రామ పరిసర ప్రాంతంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహారీ గోడకు ఆనుకొని వాగు ప్రవహిస్తున్నది. వరుస వర్షాల వల్ల పైన ఉన్న గ్రామాల చెరువులునిండి అలుగు పారుతు ఒడడంతో వరద పెరిగి నీటి ఉద్రుతి ఎక్కువై శ్రీపూరం కల్వాల్ గ్రామాల మధ్యలో ఉన్న వంతెన పై నీరు రెండు మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుండడంతో వాగు దగ్గర ఉన్న ఉన్నత పాఠశాల ప్రధాన గోడను దాటి లోపలికి నీరు చేరుకుంది,ఇది గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ బషీర్ ఎవరు పాఠశాలకు రావద్దని ఇటు శ్రీపూరం అటు కల్వాల్ భూత్పూర్ గ్రామాల విద్యార్థులకు పాఠశాలకు రావద్దని సమాచారం ఇచ్చారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మోస్తారు వర్షాలు పడిన ఇలాగే పాఠశాలకు సెలవులు ఇవ్వాల్సి వస్తుందని వాపోయారు. వాగు ప్రవాహం విషయం తెలుసుకున్న మండల అధికారులు ఎమ్మార్వో మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ వాగును పరిశీలించి ఉద్రుతి తగ్గేవరకు ఎవరు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు తెలిపారు .ఇరు గ్రామాల మున్సిపాలిటీ ట్రాక్టర్లను అడ్డుగా పెట్టించి కాపలాగా కావాలి వాళ్లను మున్సిపాలిటీ వాళ్లను ఉంచారు. శ్రీపూరం గ్రామస్తులకు నిత్యవసర సరుకులు తెచ్చుకోవడానికి, అత్యవసర సమయం లో ఆసుపత్రికి వెళ్లాలన్న చాలా ఇబ్బందికరంగా ఉందని ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

## ఐదు లక్షల యల్‌ఓసి మంజూరి చేసిన మంత్రి వాకిటి శ్రీహరి



**నర్వ, ఆగస్టు 14, (జనం సాక్షి)**
నర్వ మండలంలోని ఉందేకోడ్ గ్రామనికి చెందిన దయ్యం ఆంజనేయులు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్, వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లగా మంత్రి వెంటనే స్పందించి రూ.5 లక్షల యల్‌ఓసిని మంజూరు చేయించడం జరిగింది. మంత్రి ఆదేశాల మేరకు గురువారం నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,బీసం చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో ఆంజనేయులుకి యల్‌ఓసి అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటర్ శ్రీనివాస్ రెడ్డి,మండల కిసాన్ సెల్ అధ్యక్షులు,బద్దిపల్లి రాజారెడ్డి నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండప్ప రామలింగం పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పథకం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి



**మక్తల్, ఆగస్టు 14 (జనంసాక్షి) :** నారాయణ పేట జిల్లా రైతులకు సాగునీరు మరియు త్రాగునీరు అందించే మక్తల్ - నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్.నర్సింహా తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో రెండు సంవత్సరాలలో ఎత్తిపోతల పూర్తి చేసి సాగునీరు ఇస్తాం అని చెప్పారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం పనులు నత్తనడకగా సాగుతున్నాయని అన్నారు. పనుల వేగం పెంచి ఈ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇవ్వాలని కోరారు. అదే విధంగా భూములు కోల్పోతున్న రైతులు, అఖిల పక్ష నాయకులు చేస్తున్న శాంతియుత నిరసన కార్యక్రమాలకు ముగింపు పలకడం కోసం మెరుగైన నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.




## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఉన్నది ప్రజల సమస్యలు తీర్చడానికి వాడండి

### సెటిల్మెంట్లకు అడ్డగా మారిన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్

### బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్

### బిజెపి పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్

**కల్వకుర్తి ఆగస్ట్ 14( జనం సాక్షి) :** కల్వకుర్తి పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబీ దేవ్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్ మాట్లాడుతూ క్యాంప్ ఆఫీస్ ఇచ్చింది ప్రజల సమస్యల కోసం కానీ కాంగ్రెస్ పార్టీ అడ్డకు కాఫీలు, టీలకు బిర్యానీలకు సెటిల్మెంట్లకు అడ్డగా మారింది అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కల్వకుర్తి ఎమ్మెల్యే మీరు వచ్చి 20 నెలలు పూర్తి అయింది కానీ ఇంతవరకు ఒక గ్రంథాలయాన్ని కట్టలేకపోయారు పేరుకు విద్యావేత్త అని చెప్పు కునే మీరు పక్కనే బెల్టు షాపులు ఉన్నాయి మీ వల్ల కాలేజీ విద్యార్థులు యువత మత్తు పదార్థాలకు బానిసయ్యి పూర్తిగా చెడిపోతున్నారు అని అన్నారు. మాట్లాడితే మీరు మాట్లాడండి కానీ ఎవరో మాట్లాడితే మేము సహించాం అంటూ మండిపడ్డారు. అదేవిధంగా బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిలర్ మొగిలి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. మీరు ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే తప్ప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మారిన క్యాంప్ ఆఫీసును అడ్డాకు కాకుండా ప్రజల సమస్యలు తీర్చడానికి వాడండి అని రాజకీయంగా విమర్శలు చేస్తే మీరు వ్యక్తిగతంగా విమర్శలు చేస్తారా ఇది ఎంతవరకు సమంజసం మేము మీ మీద వ్యక్తిగత విమర్శలు చేయాలనుకుంటే మీరు కల్వకుర్తిలో తిరగలేరు బృంగి ఆనంద్ కుమార్ అని హెచ్చరించారు. ఐదు సంవత్సరాలు పరిపాలించి ప్రజలను అవినీతిపరులను చేశావు గ్రామపంచాయతీకి కేటాయి ంచిన ప్లాట్లను ప్రభుత్వానికి అప్పజెప్పాలి అని ఎక్కడైతే ప్రభుత్వానికి సంబం ధించిన ప్లాట్లు అమ్మినారో అక్కడే చర్చ పెడదాం బృంగి ఆనంద్ కుమార్ మేము సవాల్ చేస్తున్నాం మీరు ప్రెస్ మీట్ అంబేద్కర్ చౌరస్తాలో పెడతారా లేక హైదరాబాద్ చౌరస్తా దగ్గరకు పెడతారా ఆమనగల్ లో పెడతారా మీ ఇష్టం బహిరంగ చర్చకు నువ్వు సిద్ధమా అంటూ బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిలర్ మొగిలి దుర్గాప్రసాద్ హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సూర్య కృష్ణ గౌడ్ నీరుకంటి రాఘవేంద్ర గౌడ్, బోడ నరసింహ ,పాలకూర రవి గౌడ్, సురేందర్ గౌడ్, నాపశివ, అభి గౌడ్, తగుళ్ల వెంకటేష్ యాదవ్, తొడేటి అరవింద్ రెడ్డి, అఖిల్ మాకం శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పలు వివాహాలకు హాజరైన మాజీ మంత్రి

**వనపర్తి,ఆగస్టు14(జనంసాక్షి):**
మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గురువారం వనపర్తి పట్టణంతో సహా మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. వనపర్తి మండలం, పెద్దగుడెం గ్రామానికి చెందిన కోమటి చేవ రాజు కుమార్తె సుప్రియ వివాహానికి హాజరై మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వనపర్తి పట్టణం బిజినగట్టు తండా కి చెందిన జర్పుల చంద్రు నాయక్ ,వెంకటమ్మ గార్ల కుమారుడు గణేష్ ,లలిత ల వివాహానికి, వనపర్తి పట్టణంలోని ఎంబీ గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగిన చిగుళ్ళపల్లి శ్రీలక్ష్మి, శ్రీనివాస్ శెట్టిల వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.అనంతరం కొత్తకోటలోని బీపీఆర్ గార్డెన్స్ లో జరిగిన పాల్గొని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్ యాదవ్ కుమారుడు శివయాదవ్ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆదీశ్వరించారు.మాజీ మంత్రి వెంట మండల అధ్యక్షుడు కే. మాణిక్యం,నరసింహ,డేగ మహేశ్వర్ రెడ్డి చిట్యాల రాము, గ్రామ సర్పంచ్, కొండన్న, లక్ష్మం కాంత్ రెడ్డి, రవి కిరణ్, షాకీర్, హుస్సేన్, బాలకృష్ణ బాబు నాయక్ గ్రామ యువకులు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## మైల్ స్టోన్ యువక బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**నాగర్ కర్నూల్, ఆగస్టు 14(జనంసాక్షి):**
నాగర్ కర్నూల్ పట్టణం లో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మైల్ స్టోన్ చౌరస్తాలో మైల్ స్టోన్ యువక బృందం ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు, మైల్ స్టోన్ యువకబృందం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా స్వతంత్ర దినోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ప్రతి సంవత్సరంలా ఈసారి కూడా మైల్ స్టోన్ యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ రక్తదాన శిబిరానికి కాలనీకి చెందిన యువకులు మరియు పట్టణానికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేయడానికి ముందుకు వస్తున్నారని తెలియజేశారు. కావునా ఔత్సాహిత యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.పూర్తి వివరాలకు 9603336712, 9441853901 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.




## చెట్లు నాటడం మనందరి బాధ్యత

**మల్దకల్ ఆగస్టు 14(జనంసాక్షి) :** మండల పరిధిలోపాలవాయి గ్రామములో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం దగ్గర వన్ ఫర్ వన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉద్దేశించి సంస్థ అధ్యక్ష్మురాలు మాట్లాడుతూ పర్యావరణ పరి రక్షణ ప్రతి ఒక్కరి భాద్యత మానవ కోటి మనగడకు ప్రాణావాయువు చెట్లనుండే వస్తుందని,చెట్టు లేనిదే మనం లేమని అన్నారు.పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు పచ్చధనం-పరిశుభ్రత చెట్లను పెంచుదాం పర్యా వరణాన్ని కాపాడుదాం.. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన స్వచ్ఛంద సంస్థకు అభినందించారు. ఈ కార్య క్రమంలో వన్ ఫర్ వన్ సంస్థ అధ్యక్షురాలు సులామితమ్మ, పంచాయతీ కార్యదర్శి ఖాజమీర్, ఏఎన్ఎం మనోహరమ్మ, మాజీ వైస్ ఎంపీపీ రాముడు, హనుమన్న,మనోజ్,రమేష్ ప్రసాద్,ఆశ వర్కర్స్ పద్మమ్మ, సరోజమ్మ,గ్రామస్తులు రత్నం, యాకోబు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.





## తిరంగా జెండా ఎగురవేద్దాం.. దేశ భక్తిని చాటుదాం

### - బిజెపి రాష్ట్ర నేత నామాజీ

### పేటలో ఘనంగా తిరంగా ర్యాలీ

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** తీరంగా జెండా ఇంటింటి పై ఎగురవేసి దేశ భక్తిని చాటుదాం అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగు రావు నామాజీ పిలుపునిచ్చారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బిజెపి అధిష్టానం పిలుపు మేరకు తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అవదూత్ మఠం నుంచి సెంటర్ చౌక్, వీర సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ స్వామి చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగ ఫలతంగా స్వాతంత్ర్యం దక్కిందని అన్నారు.ప్రతి ఒక్కరూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రతి ఇంటిపై తిరంగ జెండా ఎగురవేసి దేశ భక్తిని చాటుదాం అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే. రతంగ్ పాండు రెడ్డి, పి.శ్రీనివాసులు, జిల్లా నాయకులు అద్యక్షుడు సత్య యాదవ్, రఘు రామయ్య గౌడ్,నందు నామాజీ, సిద్ది వెంకట్ రాములు, ఆశప్ప,లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్,సుజాత కృష్ణ,పట్టణ అధ్యక్షుడు పి.వినోద్ కుమార్,నాయకులు సత్య రఘుపాల్,చిన్న రఘు, సైదప్ప,విజయ్,లక్ష్మీకాంత్,హన్మతురావు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై భారీగా వరద

**భూత్పూర్ ఆగస్టు 14 (జనంసాక్షి):**
భారీ వర్షంతో చెరువు పొంగి పొర్లడంతో జాతీయ రహదారిపై నీరు చేరి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలగడంతో పాటు ప్రమాదకరంగా మారడంతో అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. నీరు వెళ్లడానికి రోడ్డుకు అడ్డంగా ఉన్న డివైడర్‌లను తొలగించి నీరు వెళ్లే విధంగా ప్రయత్నాలు చేశారు.మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ పట్టణ పరిధిలోని శేరుపల్లి కోమటి కుంట చెరువు అలుగు పారడంతో వచ్చిన వరదనీరు ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై ప్రవహించడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి భారీగా నీరు చేరాడంతో నీరు ఊర చెరువులోకి వెళ్లడానికి జాతీయ రహదారికి అడ్డంగా ప్రహారి గోడలు ఉండడంతో జాతీయ రహదారిపై భారీగా నీరు చేరింది. ఈ విషయం తెలుసుకున్న జోగులాంబ డిఐజీ చౌహాన్,జిల్లా ఎస్పీ జానకి లతో పాటు అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై నీరు వెళ్లడానికి రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టిని తొలగించి చెరువులోకి నీరు తరలించే ప్రయత్నాలు సాగించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వరద నీరు మల్లించే అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, చెరువులు, కుంటలు నిండిపోతోన్నాయి. అలుగు వల్ల ట్రాఫిక్ అంతరాయం జరగకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా నేషనల్ హైవే వంటి రద్దీ మార్గాలపై నిరంతర నిఘా ఉంచి, అవసరమైన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు. అలాగే వరదలలో మనుషులు లేదా పశువులు చిక్కుకున్న సందర్భంలో వెంటనే డయల్ 100కి గానీ లేదా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్, భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# నెలాఖరునుంచే జడ్చర్లలో వరద కాల్వల నిర్మాణం

- రూ.14 కోట్లతో పూర్తయిన టెండర్లు
- ఈనెలలో శంఖుస్థాపనతో ప్రారంభం కానున్న పనులు
- వచ్చే వర్షకాలం నుంచి రోడ్లపై నీళ్లు నిలువకుండా చర్యలు
- ప్రమాదకర వాగులపై రూ.44 కోట్లతో వంతెనలు
- భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- రహదారులపై ఉధృతంగా ప్రవహించే వాగులను దాటే ప్రయత్నం చేయొద్దు
- పాత ఇళ్లలో, లోతట్టు ప్రాంతాల్లో ఉండే వారు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలి
- అధికారులందరూ అప్రమత్తంగా 24 గంటలూ ప్రజలకు అందు బాటులో ఉండాలి
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, ఆగస్టు 14 (జనంసాక్షి):**
భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. జడ్చర్ల పట్టణంలో వరద నీటి కాల్వల నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వచ్చే ఏడాది లోపుగా ఈ కాల్వల నిర్మాణం కూడా పూర్తి చేసి రోడ్లపై వర్షపు నీరు నిలవకుండా చూస్తామని చెప్పారు. నియోజకవర్గంలో వర్షా కాలంలో వాగులు ప్రమాదకరంగా ప్రవహించే తొమ్మిది ప్రాంతాల్లో వంతెనల నిర్మాణాన్ని కూడా వచ్చే ఏడాదిలో పూర్తి చేయిస్తామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తూ జన జీవనం అస్తవ్యస్తమౌతున్న నేపథ్యంలో గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అనిరుధ్ రెడ్డి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటుగా వాన నీటి కష్టాల నుంచి ప్రజలను రక్షించడానికి తీసుకుంటున్న చర్యలను గురించి వివరించారు. భారీ వర్షాలు మరో రెండు, మూడు రోజులు కొనసాగనున్న పరిస్థితుల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. వర్షాలు ఈదురుగాలుల కారణంగా విద్యుత్ తీగలు తెగిపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, ముఖ్యంగా కంచెలు లేని ట్రాన్స్ఫార్మర్ల వద్ద మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విద్యుత్ తీగలు తెగిపడటం లాంటి సంఘటనలను గురించి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రహదారులపై ఉండే వాగులు ప్రమాదకరమైన స్థాయిలో ప్రవహిస్తున్నప్పుడు వాటిని దాటే ప్రయత్నం చేయకూడదని, వాగుల ఉధృతి తగ్గే వరకూ ప్రయాణాలను కూడా వాయిదా వేసుకోవాలని హితవు చెప్పారు. రాత్రి వేళల్లో ఇలాంటి వాగుల ఉధృతిని అంచనా వేయడం కష్టమౌతుందన్నారు. పెద్ద చెరువులు నిండినప్పుడు వాటి కట్టలు ఎక్కడైనా లీక్ అవుతూ తెగి పోయే ప్రమాదం ఉందని గుర్తిస్తే ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. శిధిలావస్థలో ఉన్న పాత ఇళ్లలో ఉంటున్న వారు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని వర్షాలు ఆగిపోయేవరకూ సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసుకోవడానికి విద్యుత్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

**ఈ నెలాఖరు నుంచే వరద కాల్వల నిర్మాణం:**
కొద్ది పాటి వర్షానికే జడ్చర్ల పట్టణంలోని రహదారులు జలమయమైపోతూ, జన జీవనం అస్తవ్యస్తమౌతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం వరద నీటి కాల్వలు (స్టామ్ వాటర్ డ్రైన్స్) నిర్మాణానికి టియుఎఫ్ ఐడిసి ద్వారా రూ.14 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని అనిరుధ్ రెడ్డి ప్రస్తావిస్తూ దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం పూర్తయిందని వెల్లడించారు. ఈ నెలాఖరులోపుగా వీటి నిర్మాణానికి శంఖుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. టౌన్ ప్లానింగ్ లో నిపుణులైన అధికారులతో అధ్యయనం చేయించి వర్షపు నీరు రోడ్లపై నిలువకుండా ప్రణాళికాబద్ధంగా వరద కాల్వలను నిర్మిస్తామని చెప్పారు. వీటి నిర్మాణం వచ్చే ఏడాది వర్షకాలంలోపుగా పూర్తి చేయడం ద్వారా వర్షపు నీళ్లు రోడ్లపై నిలువ కుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలు



**కృష్ణ, ఆగస్టు 14 (జనం సాక్షి):**
కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామ పెద్దలు, వివిధ పార్టీ నాయకులు, యువకులు, ఆడపడుచులు, అధిక సంఖ్యలో బొడ్రాయి మహోత్సవంలో పాల్గొనీ ప్రధాన అర్చకులు, ప్రత్యేక పూజలు, వేదమంత్రక్షాలతో, గ్రామస్తులు ఆయురా రోగ్యాలతో ఉండాలని పంటలు సమృద్ధిగా పండేందుకు ఆశీర్వాదం తీసుకుని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం, ప్రసాద వితరణ చేపట్టారు.

## డిజిటల్ తరగతులు ప్రారంభించిన ఎంఈఓ

**మక్తల్, ఆగస్టు 14 (జనంసాక్షి)**
మక్తల్ పట్టణంలోని స్థానిక ప్రాథమిక పాఠశాల (ఎస్సీ) లో దాతలు టీవీ9 వెంకటేష్, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు గోపాల్ సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను మండల విద్యాధికారి (ఎంఈఓ) అనిల్ గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ డిజిటల్ క్లాస్‌రూమ్ ప్రారంభోత్సవంలో ఎంఈఓ అనిల్ గౌడ్ మాట్లాడుతూ ఈ రోజు మనం కేవలం ఒక టెలివిజన్‌ను ప్రారంభించడం లేదు, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త మార్గం చూపుతున్నాం. డిజిటల్ తరగతులు మన విద్యార్థులకు ప్రపంచాన్ని దగ్గరగా చూసే అవకాశం కల్పిస్తాయి. కేవలం పుస్తకాల్లోని పాఠాలకే పరిమితం కాకుండా, వీడియోలు, యానిమేషన్ల ద్వారా కష్టమైన విషయాలను కూడా సులభంగా అర్థం చేసుకోవడానికి ఇది సహాయ పడుతుంది. విద్యార్థులు చురుగ్గా ఆలోచించేలా, సృజనాత్మకంగా నేర్చుకునేలా ఈ డిజిటల్ విద్య తోడ్పడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పుర పెద్దలు, దాతలు సహకరించాలని కోరారు. దాతలు వెంకటేష్, గోపాల్ మాట్లాడుతూ చిన్న సహకారం వల్ల ఇంత మంచి కార్యక్రమం జరుగుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించడం మనందరి బాధ్యత. ఈ డిజిటల్ తరగతులు విద్యార్థులను బయటి ప్రపంచంతో అనుసంధానం చేస్తాయి. ఈ టీవీ ద్వారా వివిధ విషయాలపై విద్యా కార్యక్రమాలు చూసి వారు తమ జ్ఞానాన్ని పెంచుకోవచ్చు. మా ఈ చిన్న సహాయం మరికొంతమంది దాతలను ప్రోత్స హిస్తుందని ఆశిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. కన్యాకుమారి, ఉపాధ్యాయులు బాలరాజు, వివేకానంద, పుర ప్రముఖులు తిరుపతి, నర్సిం లు, మామిళ్ల కిష్టప్ప, నాగరాజు, బోయ వెంకటేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మమ్మ, అంగన్వాడీ టీచర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**








**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :**
ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాభివృద్ధికి పాటుపడిందని ఇందులో భాగంగానే వసతి గృహాల్లో, గురుకులాల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉద్దేశంతో 40% మెస్ చార్జీలను పెంచి ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యవంతంగా అందించాలనీ ప్రధానోపాధ్యాయుడు యుగంధర్‌ను ఆదేశించారు.

అనంతరం విద్యార్థు లతో మాట్లాడి మధ్యాహ్న భోజననికి సంబంధిం చిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళాసమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, మాజీ ఎంపిటిసి సత్యారెడ్డి, సాయిచరణ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, బాబూరెడ్డి, వెంకట్రామిరెడ్డి, టైలర్ రవి, గట్టు యాదవ్, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అంగన్వాడి విద్యార్థులకు అన్నప్రాసన చేసిన ఎమ్మెల్యే**
పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ అంగన్వాడి కేంద్రంలో గురువారం నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై విద్యార్థులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలను సైతం బలోపేతం చేస్తున్నామని కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాణ్యమైన పూర్వపు విద్యను అందించాలని ఎమ్మెల్యే అంగన్వాడి టీచర్లను ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు ఎమ్మెల్యేకి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, మాజీ ఎంపిటిసి సత్యారెడ్డి, సాయిచరణ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, బాబూ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, టైలర్ రవి, గట్టు యాదవ్, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగలు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

**వనపర్తి బ్యూరో ఆగస్టు 14 (జనంసాక్షి)**



పెద్దమందడి, మణిగిల్ల గ్రామాల శివారులోని చౌదరిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ దొంగతనం చేసిన నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. గోపాల్పేట మండలం తాడిపర్తికి చెందిన మహమ్మద్ షఫీ, షేక్ రసూల్, మహమ్మద్ అన్వర్‌లు కార్, ఆటో డ్రైవర్లుగా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో ఈనెల 7న మధ్యరాత్రి ఆలయంలోకి చొరబడి హుండీలోని రూ. 25 వేల నగదు, స్వామి ఆభరణాలకు చెందిన వెండి వస్తువులను దొంగిలిం చినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో సీసీ ఫుటేజీల ఆధారాల మేరకు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం ఒప్పుకున్నారన్నారు. అందులోని నగదు, వస్తువులను తీసుకొని హుండీని జగత్ పల్లి చెక్ డ్యామ్ లో వేసినట్లు చెప్పారని ఎస్సై తెలిపారు. అలాగే డిసెంబర్లో బిజినపల్లి మండలం మంగనూరు గ్రామంలో చౌడేశ్వరి ఆలయంలో ఇదే మాదిరి దొంగతనానికి పాల్పడి 10 వేల విలువగల వస్తువులు అమ్మి ముగ్గురు సమానంగా పంచుకున్నట్లు వారి విచారణలో వెళ్ళడయిందన్నారు. నిందితుల నుండి కొంత డబ్బుతో పాటు ట్రాలీ ఆటో రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు.

# కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- పొలాల్లో రైతులు విద్యుత్ వైర్ల దగ్గర వెళ్ళరాదు - బిఆర్ఎస్.మాజీ ఉపసర్పంచ్ బి.రామకృష్ణ**

**మహమ్మదాబాద్ ఆగస్టు 14 (జనంసాక్షి) :**



రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బిఆర్ఎస్, మాజీ ఉపసర్పంచి, బి.రామకృష్ణ గురువారం పత్రిక ప్రకటన రూపంలో తెలిపారు. ఎడతెరిపి గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అత్యంత అవసరం ఉంటేనే బయటికి వెళ్లాలని సూచించారు. గ్రామాలలో చిన్నపిల్లలు ఆటలాడుతూ ఇంకుడు గుంతలు డ్రైనేజ్ అలాంటి వాటి దగ్గర పోకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. చెరువులలో వాగులలో వర్షం నీరు ఎక్కువ ప్రవహించే అవకాశం ఉండొచ్చు కాబట్టి చెపలవేట కోసం ఎవరు వెళ్లకూడదు అలాగే రైతులు పొలాల్లో మోటర్ సాటర్ వైర్ల విద్యుత్ స్తంభాలు అలాగే విద్యుత్ శాఖ గురికాకుండా అలాంటి పనిముట్ల దగ్గర వెళ్ళొద్దన్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ఇండ్లలో ఉన్న వారిని అధికారులు గుర్తించి సురక్షితమైన ఇండ్లలోకి చేర్పించాలన్నారు.ఏదైనా ప్రమాదం జరిగితే ఉన్నత అధికారులకు లేదా పోలీస్ సిబ్బందికి తెలియజేయాలన్నారు.



# ప్రజా పోరాటాల్లో సిపిఐకి వందేళ్ళ చరిత్ర : శ్రీరామ్

**వనపర్తి బ్యూరో ఆగస్టు 14 (జనంసాక్షి) :**
ప్రజా పోరాటాల్లో సిపిఐ కి వందేళ్ళ చరిత్ర ఉందని మరే రాజకీయ పార్టీకి ఇంత ఘన చరిత్ర లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే శ్రీరామ్ అన్నారు. గురువారం వనపర్తి సిపిఐ జిల్లా కార్యాలయం వద్ద సిపిఐ నాలుగవ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను విడుదల చేసి మాట్లాడారు. కార్మికులు కర్షకులు బడుగు బలహీన ప్రజల గొంతుకగా చట్టసభల్లో బయట పోరాటాలు నడిపిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి కోసం సిపిఐ సాగించిన పోరాటం చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. అంతటి చరిత్ర గల సిపిఐ నాలుగవ రాష్ట్ర మహాసభలు మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో ఈనెల 19 నుంచి 22 వరకు జరుగుతుందని జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీనియర్ నేత కళావతమ్మ, సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్,సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, చిన్న కురుమన్న, జయమ్మ, శిరీష,రాంబాబు,మహేష్, వంశి, విష్ణు,జ్యోతి,మైబుసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**- జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావు**



**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 14 (జనం సాక్షి)**
భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్య ంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలనీ జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావు అన్నారు. వాగులు, కాలువలు,నదులు రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లారాదనీ, గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామాధి కారులు ప్రజలను అప్రమత్తం చెయ్యాలనీ ,నీరు అత్యధికంగా ప్రవహిస్తున్న ప్రాంతాల వద్దకు వెళ్లరాదనీ, నాలాలు,వాగులు ప్రవహిస్తున్న రహదారులు, రోడ్లు దాటరాదనీ,చెట్లకింద , పాడైన భవనాల కింద , శిథిలావస్థలో ఉన్న భవనాల కింద ఉండరాదనీ,కరెంటు స్తంభాలు ముట్టుకోరాదనీ, వర్షాలకు రహదారులు చిత్తడిగా ఉంటాయి కాబట్టి వాహనాలు నెమ్మదిగా నడపాలనీ, అవసరమైతేనే ప్రయాణాలు చేయాలనీ, వర్షాల కారణంగా తగిన జాగ్రత్తలు తీసుకుందాం మనల్ని మనం కాపాడుకుందాం అని జిల్లా ఎస్పీ సూచనలు చేశారు.

# మనిషికి చెట్లే మనుగడ

**- పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక**



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):**
ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి మనుగడకు చెట్లే ఆధారమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి అన్నారు. గురువారం ధన్వాడ మండలం కొండాపూర్ వద్ద గల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. మొదటి సారి కొండాపూర్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కి వచ్చేసిన ఎమ్మెల్యేకు విద్యార్థులు,ఉపాద్యాయులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# శ్రేణులంత నేడు నర్సాపూర్‌కు తరలిరండి

**శివ్వంపేట ఆగస్ట్ 14 జనంసాక్షి:**



మాజీ జడ్పీటీసీ, దివంగత నేత వాకిటి లక్ష్మారెడ్డి 26వ వర్ధంతినీ పురస్కరించుకొని ఈనెల 15న ఉదయం 10 గంటలకు నర్సాపూర్ లోని సాయికంజర్ల ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిభిరానికి మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ పేరిట తాలూక లోని పదవ తరగతి లో మండల్ టాపర్స్ గా వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కాబట్టి విద్యార్థులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా రమణ గౌడ్ విజ్ఞప్తి చేశారు. శివ్వంపేట మండలంలోని యువకులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కోరారు.



## పొదుపు లక్ష్యాలకు తోడ్పాటు

**పాపన్నపేట, ఆగస్టు 14 (జనంసాక్షి) :** పొదుపు ఆర్థిక లక్ష్యాలు సాధించేందుకు తోడ్పడుతుందని పాపన్నపేట వివోఏ లు వెంకట లక్ష్మీ,ఇందిరా రాణి పేర్కొన్నారు. ఆగస్టు 14 జాతీయ ఆర్థిక అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం పాపన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 60 సంవత్సరాల లోపు మహిళలు,కిషోర బాలికలు,వికలాంగుల పొదుపు గ్రూపుల అవశ్యకతను మహిళా సంఘం సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని,ప్రతి ఒక్కరూ పొదుపు చేస్తేనే కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. సీసీ శివరంజని,గ్రామపంచాయతీ కార్యదర్శి నయీమ్ పాల్గొన్నారు .

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తూప్రాన్ గీతా విద్యార్థుల ముందస్తు ప్రదర్శన




**తూప్రాన్ ఆగస్టు 14 (జనం సాక్షి):** " మూడు రంగుల జెండా ఇది ముచ్చటైన జండా. అంటూ తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. 300 మంది విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో త్రివర్ణ పతకం ఆకృతిలో కూర్చుని స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటారు. జండాకు ఇరువైపుల జాతీయ పుష్పమైన "కమలం" ఆకారంలో కూర్చుని అలరించారు. స్వాతంత్ర్య దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేస్తూ దేశభక్తిని చాటుకున్నారు. చిన్నారుల ప్రదర్శనను పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు ప్రశంసించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, ఇంచార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు విద్యార్థులకు శు భాకాంక్షలు తెలియజేశారు.


## పిడుగుపాటుకు పాడి పశువు మృతి

**చేర్యాల ఆగస్టు 14 (జనంసాక్షి):** పిడుగుపాటుకు గురై పాడి పశువు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆకునూరు గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కోయినేని యాదయ్య అనే రైతుకు చెందిన పాడి పశువు బావి దగ్గర కట్టేసి ఉండడంతో ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడి మృతి చెందినది. సుమారు రూ. 1.50 ఒక లక్ష యాభై వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.



## ముందస్తు చర్యలు చేపట్టాలి

### మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 14(జనం సాక్షి)** రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు మరింత అప్రమత్తంగా ఉండి ఏవిధమైన ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి మంత్రి గురువారం నాడు సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు కోటి రూపాయిలు విడుదల చేశామని అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు,సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు.లోతట్టు ప్రాంతాలు,వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు.

అంటువ్యాధులు ప్రబలకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని,అలాగే నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ నర్సింగ్ రావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్

**వనపర్తి బ్యూరో ఆగస్టు 14 జనంసాక్షి** ఆర్ గ్యారంటీలు 421 అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ రెండేళ్లు గడుస్తున్న నేటికీ హామీలను అమలు చేయలేదని వనపర్తి జిల్లా బిజెపి అధ్యక్షులు డి నారాయణ ఎద్దేవా చేశారు. గురువారం బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా నూతన కమిటీ ని ప్రకటించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలు 421 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా అమలు చేయలేక ఘోర వైఫల్యం చెందాడని అన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు ఆదేశం మేరకు నూతన జిల్లా కమిటీ, కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులు బాశెట్టి శ్రీనివాసులు, పద్మమ్మ, కె శివారెడ్డి గోర్ల బాబురావు ,రాఘవేందర్ గౌడ్, మొరార్జీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పి శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, వారణాసి కల్పన కార్యదర్శులు జి సురేందర్ యాదవ్, రామ్ రెడ్డి కావలి తిరుపతయ్య, కాటమోని కృష్ణ గౌడ్ గుంటి మణి వర్ధన్ సాగర్ సరోజ, కోశాధికారి బందారు కుమారస్వామి, కార్యాలయ కార్యదర్శి ఆగపోగు కుమార్, మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, సోషల్ మీడియా



ఇన్చార్జ్ ఆనంద్ కుమార్ ఐటీ ఇన్చార్జ్ జి ఆంజనేయులు పాత్రి కేయ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ సర్పంచ్ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాల లోపలికి వరద నీరు

**నర్వ ఆగస్టు 14 (జనంసాక్షి):** నర్వ మండల పరిధిలోగల శ్రీపురం గ్రామ సమీపంలో గల ఉన్నత పాఠశాల ప్రవారి దాటి వరద నీరు లోపలికి చేరుకుంది. ఈ విషయాన్ని గమనించిన ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ బషీర్ పాఠశాలకు వస్తున్న శ్రీపురం కల్వాల్ భూత్పూర్ సత్యారం విద్యార్థులకు పాఠశాలకు సెలవు ఇవ్వడం జరిగిందని ఎవరు పాఠశాలకు రావద్దని సమాచారం అందించారు. చాలా సంవత్సరాల నుంచి మోస్తారు వర్షాలు పడిన పైన ఉన్న చెరువులు నుండి అడవులు అలుగులు పారడంతో ఇరు గ్రామాల మధ్య ఉన్న వంతెన పై నీరు మీటర్ ఎత్తులు ప్రవహించి పాఠశాల విద్యార్థులకు చాలా ఇబ్బందికరంగా ఉందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. చాలా సంవత్సరాల నుండి ఈ విషయాన్ని ప్రభుత్వం అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని గ్రామస్తులు అన్నారు. ఒకసారి వర్షం పడితే మూడు నాలుగు రోజులపాటు నిత్యవసర సరుకులకు అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్న చాలా సమస్యగా ఉందని ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు గుర్తించి తక్షణమే శ్రీపురం గ్రామస్తుల ఆవేదన అర్థం చేసుకొని నూతన వంతెనను నిర్మించాలని ప్రభుత్వాన్ని ప్రజలు



కోరుతున్నారు. ఈ వాగు ఉధృతిని తెలుసుకున్న మండల అధికా రులు ఎమ్మార్వో మల్లారెడ్డి,ఎంపీడీవో శ్రీనివాస్,సబ్ ఇన్స్పెక్టర్ పి,రమేష్ కుమార్ వాగును పరిశీలించి వాగు నీరు తగ్గేదాకా ఎవరు కూడా వాగు దాటవద్దని సూచించారు. ఇరు గ్రామాల మున్సిపాలిటీ కావాలి వాళ్లను ఎవరిని వెళ్లకుండా చూడమని ఆదేశాలు జారీ చేశారు. ఎవరు కల్వాల్ సంతకువెళ్లకుండా పోలీసు అధికారులు గ్రామస్తులను నివారించారు.

# భజరే నందగోపాల హరే..!

- బాల్యం నుంచే శ్రీకృష్ణుని లీలల ప్రదర్శన
- నోటిలోనే సర్వలోకాలు చూపిన పుణ్యమూర్తి
- సర్వమహాపాతకాలు తొలగించే శ్రీకృష్ణ వ్రతం
- రేపు శ్రీకృష్ణ జన్మాష్టమి





**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 14( జనం సాక్షి)**
గోకులాష్టమి...కృష్ణుడు పుట్టిన రోజు. నల్లనయ్య నవ్వులు చిందించిన రోజు... ఈ పండుగను పిల్లాపెద్దా అందరూ ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. ముఖ్యంగా తల్లులు తమ పిల్లలను అందంగా అలంకరించుకుని చూసుకుని మురిసిపోతుంటారు. అబ్బాయిని కృష్ణునిగా, అమ్మాయిని గోపికగా అలంకరించుకుని ముచ్చటపడతారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 16 శనివారం గోకులాష్టమి( శ్రీ కృష్ణ జన్మాష్టమి ) ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి శ్రీకృష్ణ మందిరం, సదాశివపేటలోని కృష్ణ మందిరం అలాగే జిల్లాలోని వివిధ పట్టణాలలో ని శ్రీకృష్ణ మందిరాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**గోపాలుడు అల్లరి వాడు.. అందరివాడు..**
అందరిలోనూ ఉన్న వాడు. "కృషితీత కృష.... అంటే కష్టపడి పని చేసే వాడు, అందరినీ ఆనందింపజేసే వాడు అని అర్థం. హృదయాంత రాళ్లోని దుష్టచిం తనలను తొలగించి ప్రేమను పంచే వాడు. 'కర్మతీతి కృషః" అంటే మాటలు, పాటలతో అందరినీ ఆకర్షించే వాడు విష్ణు సహస్ర నామ స్తోత్రంలో 57వ నామంగా వచ్చే 'కృష్ణ' అంటే సచ్చిదానంద స్వరూపాన్ని సూచించేది. మహాభారతంలోని ఉద్యోగ పర్వంలో చెప్పినట్లు 'కృష్' అంటే 'దున్నుట' అని అర్థం. భూమిని దున్నే నాగలి మొన నల్లగా ఉంటుంది. మానవుల్లోని 'అజ్ఞానం' అనే వ్యర్థాన్ని తొలగించి (దున్ని) జ్ఞానాన్ని కలుగుచేసేవాడు కాబట్టి ఆ నల్లనయ్యను కృష్ణుడు అన్నారు.

**యాదవుల కులదైవంగా శ్రీకృష్ణుడు**
కృష్ణాష్టమిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. శ్రీకృష్ణుని తల్లితండ్రులు దేవకీ వసుదేవులు. కృష్ణుడు అనగానే యాదవులు గుర్తొస్తారు. యాదవులు కృష్ణుణ్ణి కులదైవంగా పూజిస్తారు. కృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు చేస్తారు. వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. కృష్ణుణ్ణి ఇంట్లోకి ఆహ్వానిస్తూ కృష్ణుని పాదాలు వేయడం ఆనవాయితీగా వస్తోంది.

గోకులాష్టమి పండుగ జరుపుకున్న తరువాత ఉట్టి కొట్టే కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తారు. ఇందులో పిల్లలు, పెద్దలు అందరూ ఉత్సాహంగా పాల్గొంటారు. గోకులాష్టమి రోజున పాఠశాలల్లో ఉండే హడావిడి అంతా ఇంతా కాదు. పిల్లలందరూ గోపిక, కృష్ణుని అలంకరణలో వస్తారు. తల్లితండ్రులు కృష్ణుని అలంకరణలో ఉన్న తమ పిల్లలను చూసి ఆ గోకుల కృష్ణుడే తమ ఇంటికి వచ్చినట్టుగా ఆనందిస్తు మురిసిపోతారు.

**ఇలా చేయండి...**
ధోతీ: సిల్క్ ధోతీ తీసుకోవాలి. కృష్ణునికి పసుపు రంగు చాలా ఇష్టం. ఒకవేళ ఆ రంగు దొరకకపోతే తెలుపు, ఎరుపు రంగు ధోతీ ఎంచుకోవచ్చు. రెడీమేడ్ కూడా ధోతీలు లభిస్తాయి.కిరీటం: కృష్ణుని వేషధారణలో ముఖ్యమైనది. కిరీటం రెడీమేడ్ కొనుగోలు చేయవచ్చు. కార్డ్బోర్డు తీసుకుని గోల్డ్ పేపర్ అతికించి ఇంట్లోనూ తయారుచేసుకోవచ్చు. పిల్లలు కిరీటం పెడితే అసౌకర్యంగా ఫీలవుతారు. కాబట్టి తక్కువ బరువు ఉండే విధంగా పేపర్ కిరీటం ఎంచుకుంటే మంచిది. కిరీటంపై నెమలి పించం తప్పనిసరి. టేప్ సహాయంతో కిరీటంపై నెమలి పింఛం అతికించుకోవచ్చు. చేతిలో వేణువు ( ఫ్లూట్) లేకుంటే కృష్ణుని అలంకరణ పూర్తి కాదు. ఫ్లూట్ తప్పకుండా చేతిలో ఉండాలి.

**ఇతర ఆభరణాలు :** ముత్యాల దండలు వేస్తే అలంకరణ ఆకట్టుకునే విధంగా ఉంటుంది. పిల్లలు ఫీలవ్వకుండా ఉండటం కోసం తక్కువ బరువున్న జ్యువెలరీ ఉపయోగించాలి. భుజాలకు ఆభరణాలు వేయాలి. చేతికి రాఖీ కట్టడం ద్వారా కూడా ఆకట్టుకునే విధంగా చేయొచ్చు. చెవులకు వేలాడే రింగులు మరువద్దు. నీలరంగు వేయడం మీ ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. నుదుటిపై తిలకం, మెడలో పూలదండ వేస్తే చిన్ని కృష్ణుడు రెడీ..

**ఉట్ల పండుగ..**
బాల్యంలోని శ్రీకృష్ణుడి విన్యాసాలకు చిహ్నంగా ఉట్ల పండుగను వేడుకగా జరుపుతారు. అందనంత ఎత్తులో ఉట్టిని కట్టి, అందులోని వెన్నను సాహసంతో తీసుకొచ్చినవాళ్లను బాలకృష్ణుడి ప్రతీకలుగా భావించేవారు. ప్రస్తుతం ఉట్లలో పాలు, వెన్నకు బదులు డబ్బులు ఉంచి గెలిచినవారికి బహుమతిగా ఇస్తున్నారు. ఉట్టి కొట్టే వేడుక ఆద్యంతం పిల్లలు యువకులతోపాటు అందరినీ అలరిస్తుంది. ఉట్టిని అందుకునేందుకు చేసే ప్రయత్నాలను సున్నితమైన పద్ధతుల్లో భంగపరుస్తూ వినోదిస్తుంటారు.

**అష్టమినాడు ఏమి చేయాలి?**

- బాలకృష్ణుడిని గృహంలోకి ఆహ్వానిస్తూ వాకిట్లో బియ్యం పిండి లేదా ముగ్గుతో బాలగోపాలుడి పాదాలను వేయాలి. ఇంటి ద్వారాలకు మామిడి తోరణాలు కట్టాలి.
- తెల్లవారు జామునే అభ్యంగన స్నానం ఆచరించి తులసీ దళాలు వేసిన నీటిని తీర్థంగా సేవిస్తూ ఆ రోజంతా ఉపవాస దీక్షతో గడపాలి.

సాయంత్రం గృహం మధ్యలో గోవు పేడ తో అలికి శోభాయమానంగా రంగవల్లికలు తీర్చిదిద్దాలి.

- మధ్యలో బియ్యంపోసి మండపం ఏర్పరచి దానిపై నూతన కుంభాన్ని ఉంచాలి..
- గంధపుష్పాక్షతలతో పూజించాలి. నూతన వస్త్రం చుట్టి బాలకృష్ణుని ప్రతిమ ఉంచాలి.
- షోడశోపచారాలు సమర్పించి పొన్న పూలతో తప్పనిసరిగా కృష్ణపూజలు చేయాలి.
- వేయించిన మినపపిండి పంచదార, బెల్లం, శొంఠి, పిప్పళ్లు దంచి మెత్తగా చేసి నివేదించాలి.
- అర్ధరాత్రి వరకు పాలు, పెరుగు, నవనీతం (వెన్న) శ్రీకృష్ణునికి నైవేద్యంగా సమర్పించాలి.
- శ్రీకృష్ణ కుచేలుల స్నేహవారది అయిన అటుకులలో బెల్లం కలిపి ఉంచుతారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పటాన్చెరు ఆగస్టు 14(జనం సాక్షి) :** నియోజకవర్గ ప్రజల సంక్షేమం ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్లకు సంబంధించిన సంబంధించిన 41 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 16,57,500 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు. దీని ద్వారా ప్రతి నెల లక్షలాది రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసిలు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

## కొండల్ రావు కుటుంబాన్ని పరామర్శించిన మదన్ రెడ్డి

**శివ్వంపేట ఆగస్ట్ 14 జనంసాక్షి:**



మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామానికి చెందిన బీ జే పీ రాష్ట్ర నాయకులు వెంకన్నగారి కొండల్ రావు తల్లి అనారోగ్యం తో ఇటీవల మృతి చెందారు. పార్టీ నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి తో కలిసి శివ్వంపేటలోని కొండల్ రెడ్డి నివాసానికి వచ్చి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆయన తల్లి మరణం పై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో వారి వెంట నర్సాపూర్ సొసైటీ చైర్మన్ రాజు యాదవ్ ముఖ్య నాయకులు, భాస్కర్ రావు తదితరులు ఉన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

**మక్తల్, ఆగస్టు 14 (జనంసాక్షి) :**



భారత్ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య తన ఇంటిపై జాతీయ పథకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు భారతదేశంలోని ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని అన్నారు. ప్రతి భారతీయుడు భారత దేశ ఔన్నత్యాన్ని గొప్పతన్నాన్ని స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మరొకసారి తెలుసుకోవాలని అన్నారు. దేశ ప్రజలందరూ సంఘటితంగా ఐక్యంగా ఉన్నప్పుడే భారతదేశం ప్రపంచంలో విశ్వ గురువుగా నిలుస్తుందని సూచించారు. కాబట్టి మన మంతా కూడా భారతీయులమంతా ఒకటేనని నిరూపిస్తూ ప్రతి ఇంటిపై జాతీయ పథకాన్ని ఎగరవేయాలని పిలుపునిచ్చారు. బిజెపి సీనియర్ నాయకులు సోమశేఖర్ గౌడ్, రాజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

**జడ్చర్ల, ఆగస్టు 14 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి మూడు ఇండ్లు కూలి నిరాశ్రయులైన బాధితులకు గురువారం విషయం తెలిసిన మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత బాధితులకు ధైర్యాన్ని తెలిపి, అత్యవసరంగా కావాల్సిన వ్యత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా కూలిన ఇండ్లను పరిశీలించి, బాధితుల ఆర్థిక స్థితిగతులను తహసిల్దార్ నర్సింగ్ రావు వివరించి బాధితులకు మందార ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. అలాగే వర్షం వల్ల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల 15 ట్రాక్టర్ ఇసుక కొట్టుక పోవడంతో వారికి ఉచితంగా ఇసుకను ప్రభుత్వం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు, పాత ఇండ్లల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, చెరువుల దగ్గర అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాయకులు కోనేటి నరసింహులు, అనుప కృష్ణయ్య పాల్గొన్నారు.



## కుటుంబ పోషణ భారంగా మారింది

-రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు అయ్యన్న

**మానవపాడు, ఆగస్టు 14 (జనం సాక్షి )**



జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల పరిధిలోని అన్ని గ్రామాల రేషన్ డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మానవపాడు మండలం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు అయ్యన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకేసారి మూడు నెలల బియ్యం ప్రజలకు అందజేసి కృషి చేసింది అని ఆయన అన్నారు.. కానీ మాకు కమిషన్ డబ్బులు అందక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. కనీసము కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందని అయన ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి.. మాకు కమిషన్ డబ్బులు ఇప్పించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాయకోటి రాజు, జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షులు నిషార్ భాష కు తమ సమస్యల గురించి వినతిపత్రం త్వరలో వీరి సమస్యల గురించి వినతి పత్రం అందజేయడం జరుగుతుందని డీలర్ల సంఘం మానవపాడు అధ్యక్షులు అయ్యన్న తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి



**ఉర్కొండ ఆగస్టు 14, .( జనం సాక్షి )**

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు పనిలో వేగం పెంచి త్వరగా నిర్మించుకోవాలని మండల ఎంపీడీవో కృష్ణయ్య తెలుగు మండలంలోని ఊర్కొండపేట, జకినాలపల్లి గ్రామాలను సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించడం జరిగింది. జకినాలపల్లి గ్రామంలో పురోగతి బాగాలేనందున ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి త్వరగా నిర్మించుకోవాలని సూచనలు చేయడం జరిగింది. అనంతరం ఊర్కొండపేట నర్సరీని సందర్శించి నర్సరీలో మిగిలిపోయిన మొక్కలను లక్ష్యానికి అనుగుణంగా నాటించుటకు పంచాయతీ కార్యదర్శికి సూచించడం జరిగింది. ఈ సందర్భంలో ఎంపీ ఓ లక్ష్మణ్, హౌసింగ్ ఏఈ తరుణ్, ఏపీవో నర్సింహా, పంచాయతీ కార్యదర్శులు ఇబ్రహీం, ముస్తఫ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సంగంబండకు పోటెత్తిన వరద

- ఐదు గేట్ల ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు

**మక్తల్, ఆగస్టు 14 (జనంసాక్షి)**

భీమా ప్రాజెక్టు లో అంతర్భాగంగా నిర్మించిన సంగంబండ రిజర్వాయర్ కు వరద పోటెత్తుతోంది. వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల పెద్దవాగుకు పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతుంది. మక్తల్ ప్రాంతం తో పాటు రిజర్వాయర్ కు ఎగువ భాగాన కర్ణాటక లోనూ పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్ లోకి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతుండడంతో ఐదు గేట్ల ను ఎత్తి దిగువకు ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ లోకి 3000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా అదే స్థాయిలో ఐదు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 3.317 టీఎంసి కాగా ప్రస్తుతం 2.58 టీఎంసీల నీరు రిజర్వాయర్ లో ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. వరద మరింత పెరిగితే మళ్లీ మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



### అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పొందిన

# ప్రతి ఒక్కరికీ ఉద్యోగం లభిస్తుంది

**జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్**

**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 14 (జనం సాక్షి)**



అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం లభిస్తుందని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ప్రవేశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను ఆధునిక టెక్నాలజీ హబ్‌లుగా మార్చి యువతకు నైపుణ్య శిక్షణను అందించే అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ సెంటర్లు సాధారణ ఐటీఐలతో పోలిస్తే పూర్తిగా ఆధునిక మౌలిక వసతులతో, ప్రపంచ స్థాయి ల్యాబ్‌లు, ఇండస్ట్రీ 4.0 ప్రమాణాలకు అనుగుణమైన యంత్రాలతో రూపొందించబడ్డాయని చెప్పారు. జిల్లాలోని మొత్తం 172 సీట్లు 100 శాతం వారం రోజుల్లో అభ్యర్థులను భర్తీ చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం 15 మంది విద్యార్థులను ఏటీసీలో చేర్పించాలని స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో పంచాయతీ సెక్రటరీలు ప్రజలకు అవగాహన కల్పించి, విద్యార్థులను అడ్మిషన్ చేయించాలన్నారు.పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల వివరాలను డి.ఈ.ఓను సమర్పించాలని అన్నారు.పదవ తరగతిలో పాస్ అయిన వారితో పాటు, ఇంటర్‌లో చదువు మానేసిన విద్యార్థులను కూడా ప్రోత్సహించి,వారికి ఏటీసీలో ప్రవేశం కల్పించాలన్నారు.ఐటీఐ పాసైన వారు లేదా ఇప్పటికే ఉన్నత విద్యలో చేరిన వారు కూడా ఏటీసీలో చేరితే,వారికి మరింత మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.ఏటీసీలో మొత్తం 6 కోర్సులు అందుబాటులో ఉన్నాయని,ఈ కోర్సుల్లో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా ఉద్యోగావకాశం లభిస్తుందని తెలిపారు. హాస్టల్‌లో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ విద్యార్థులు మధ్యాహ్న భోజనం సదుపాయం అందించబడుతుందని తెలిపారు. ఏటీసీలో ప్రవేశ రుసుము ఏదీ లేదని,ఆసక్తి గలవారు https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్.ఎస్.సి, టీసి సర్టిఫికేట్,ఆధార్ నంబర్ తప్పనిసరిగా సమర్పించాలని అన్నారు. ప్రవేశాలకు సంబంధించిన ఏమైనా సమాచారం కోసం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌ను 7095930577, 8500464782 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. నిపుణులైన ట్రైనర్ల పర్యవేక్షణలో శిక్షణ అందించబడుతుందని, విద్యార్థులు కోర్సు పూర్తిచేసిన వెంటనే టాప్ కంపెనీలో ప్లేస్‌మెంట్ లభిస్తుందని తెలిపారు. అత్యాధునిక మెషిన్లపై రియల్ టైమ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించడం ద్వారా యువతకు నాణ్యమైన నైపుణ్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఉద్యోగ అవకాశాలు మాత్రమే కాకుండా,స్వయం ఉపాధి ప్రారంభించగలిగే నైపుణ్యాన్ని కూడా ఈ కోర్సులు అందిస్తాయని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పై పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ,నర్సింగ రావు, డిపిఒ నాగేంద్రం, సహాయ లేబర్ కమిషనర్ మహేష్ కుమార్,జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక,ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ,జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్,ఆర్ అండ్ బి అధికారి ప్రగతి,బిసి సంక్షేమ అధికారి నిశిత, తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలి

**ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక సీనియర్ అధికారులు**

**సెలవుల్లో ఉన్న అధికారుల, సిబ్బంది వెనక్కు**

**భారీ వర్షాలు, సహాయక చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలతో**

**రెవెన్యూ, విపత్తుల నిర్వహణాశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్**



**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 ( జనం సాక్షి ):**



రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండి ఏవిధమైన ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి గురువారం నాడు సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో మంత్రివర్యులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీ లో మెదక్ కలెక్టరెట్ లోని వీసీ హాల్ నుండి జిల్లా ఎస్పీ డీ . వి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.....గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గడచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్‌గా ఉన్నమెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్లను అప్రమత్తం చేశారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వర్షాలు వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా వివరించారు. ఈ వీసీ లో సంబంధిత శాఖల వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జలమయంగా జడ్చర్ల



ఆ తర్వాత బస్సులను బయటకు తీశారు. అలాగే నల్లచెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జడ్చర్ల నుండి కావేరమ్మపేట వెళ్లే రోడ్డుపై పోచమ్మ దేవాలయం ఎదురుగా పాఠశాల విద్యార్థులు కావేరమ్మపేట వెళ్లేందుకు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నేతాజీ చౌక్, వెంకటేశ్వర కాలనీ, రాజీవ్ నగర్, చైతన్య నగర్, నల్లకుంట, పద్మావతి కాలనీతో పాటు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వెంకటరమణ థియేటర్ ఎదురుగా నాగర్ కర్నూల్ రోడ్డు నీట మునిగి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర య్యాయి. నాగర్ కర్నూల్ రోడ్డులో ట్రాఫిక్ అంత రాయం ఏర్పడడంతో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి రోడ్డుపైకి వచ్చి వర్షంలో తడుస్తూ అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఎమ్మెల్యే స్వయంగా ట్రాఫిక్ ను నియంత్రించారు. పట్టణంలోని విద్యా ర్థులు పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలు ముందుగానే సెలవు ప్రకటించక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. పాఠశాల ప్రారంభమైన కొద్దిసేపటికి పాఠశాల సెలవు అని తెలుపడంతో తల్లిదండ్రులు తిరిగి అప్పుడే వెళ్లి విద్యార్థులను తిరిగి ఇంటికి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇండల్లోకి చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాదేపల్లి బాల బాలికల జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న ఉర్దూ మీడియం బాలికల పాఠశాలలో వర్షపు నీరు చేరడంతో విద్యార్థినిలు తీవ్ర ఇబ్బం దులకు గురయ్యారు. పాఠశాల ప్రధాన గేటు నుంచి పాఠశాలలోకి వెళ్లేందుకు రాకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. మున్సిపల్ కార్మికులతో కలిసి వర్షపు నీటిని దారి మళ్ళించే సహాయక చర్యలు పోలీస్, మున్సిపల్ అధికా రులు చేపట్టారు. తమ వార్డులలో కౌన్సిలర్లు సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షాలు కురిసిన ప్పుడల్లా భయపడాల్సి వస్తుందని, వర్షాలకు నీరు ఇండ్లల్లోకి, రోడ్లపై చేరకుండా శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కొత్త రేషన్ కార్డుల పంపిణీ



**రాజోలి, ఆగస్టు 14 (జనంసాక్షి) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు రాజోలి మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో గురువారం తహసీల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ..కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన లబ్ధిదారులు ఏండ్ల తరబడి ఎదురు చూడగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రజా ప్రభుత్వానికే సాధ్యమైందని పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులంతా ప్రజా ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులిపాటి దస్తగిరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ హస్సేన్, మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్, ఎస్సి సెల్ అధ్యక్షులు రాజు, సీనియర్ నాయకులు గంగిరెడ్డి, నాగరాజు, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 3 రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### - మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి)**
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు వచ్చే 2,3 రోజుల పాటు అప్రమత్తం గా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. గత రెండు రోజులుగా వస్తున్న వర్షాల కారణంగా తలెత్తిన పరిస్థితులను గురువారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కార్యాలయం నుండి మండల ప్రత్యేక అధికారులు, ఇరిగేషన్ శాఖ ఈ.ఈ.లు, మున్సిపల్ కమిషనర్లు, మండల తహసీల్దారులు, ఎం.పి.డి.ఓలు ఎం.పి.ఓలు, ఏం.ఈ.ఓ లతో వెబెక్స్ సమావేశం నిర్వహించి సమీక్షించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం రాత్రి జిల్లాలో భారీ వర్షం కురిసినట్లు తెలిపారు. వర్షాలు నేపథ్యంలో జిల్లా అధికారులు మండల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ తమ తమ కార్య స్థానాల్లో అందుబాటులో ఉండాలని ఎటువంటి సెలవులు మంజూరు చేయబడవని, ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరిం చారు. జిల్లా కలెక్టర్ మండల వారిగా మండ లాల్లో వర్షాల కారణంగా తలచిన పరిస్థితులు అధికారులు తీసుకున్నాం సహాయక చర్యలు సమీక్షించి సూచనలు చేశారు. భారీ వర్షాల కారణంగా రహదారులు దెబ్బతింటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. చెరువులు,వాగులు నిండి అలుగు పారి రోడ్లపైకి, ప్రవహించే అవకాశం ఉందని,అధికారులు ట్రాపిక్ అంతరాయం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు గండి పడే ప్రమాధం ఉందని ఇసుక బ్యాగులు, సామాగ్రితో సిద్ధంగా ఉండాలని అన్నారు. చెరువులు,ప్రాజెక్ట్ లు నీటి మట్టం ఇరిగేషన్ అధికారులు పరిశీలించి క్షేత్ర స్థాయిలో ఇరిగేషన్ అధికారులు అందుబాటు లో ఉండాలని అన్నారు. లో కాజ్ వేల వైపు ట్రాఫిక్ వెళ్లకుండా బారికేడింగ్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువులు, కుంటలు,నీటి ప్రవాహం ఉన్న చోట పశువుల కాపరులు వెళ్లకుండా టామ్ టామ్ ద్వార చాటింపు చేయాలని కలెక్టర్ సూచించారు.

జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా అవగాహన కలిగించాలని ఆదేశించారు. వరద కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. సహాయక శిబిరాలకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. వర్షం, స్థానిక పరిస్థితులను అనుసరించి పాఠశాలలు, అంగన్ వాడి లకు ఎం.ఈ. ఓ.లు, అంగన్ వాడి సూపర్ వైజర్ లు స్థానికంగా సెలవు ప్రకటించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాల కారణంగా డెంగ్యూ,అతిసార కేసులు నమోదు అవుతున్నట్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది తగిన వైద్య చికిత్స అందించాలని అన్నారు. మున్సిపాలిటీ లు, గ్రామాల్లో డెంగ్యూ ప్రబల కుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని, అంటే లార్వా ఆపరేషన్,నీరు నిల్వ ఉండకుండా చూడాలని, మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారి తెగి పోయి,రాక పోకలు అంతరాయం ఉండే గ్రామాల్లో గర్భిణీ స్త్రీలు ఉంటే వారికి వైద్య సేవలు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి, జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆర్థిక సాయం అందించిన మాజీ సర్పంచ్ దీపక్ రాథోడ్

**జడ్చర్ల, ఆగస్టు 14 (జనంసాక్షి):**
మండల పరిధిలోని మాటుబండ తండా గ్రామపంచాయతీ లోని గొల్లోని దొడ్డి తాండకు చెందిన మూడవత్ కిషన్ శాంతి దంపతుల కూతురు కవిత వివాహ నిమిత్తం గురువారం మాటుబండ తాండ మాజీ సర్పంచ్ దీపక్ రాథోడ్ నూతన వధూవరులను ఆశీర్వదించి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తీజ్ వేడుకలు: ఆనందం- భక్తితో కూడిన పండుగ





**చారకొండ, ఆగస్టు 14(జనంసాక్షి)**
మండల పరిధిలోని గైరాన్ తండాలో గిరిజన సంస్కృతి సంప్రదాయానికి పత్రికగా తీజ్ వేడుకలను తండా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం తీజ్ వేడుకల ముగింపులో భాగంగా తండా ప్రజలు డబ్బుల చప్పుడుల మధ్య గిరిజనులు నృత్యాలతో సందడి చేశారు. ఇందులో భాగంగా గిరిజన యువతులు తొమ్మిది రోజులపాటు బుట్టల్లో గోధుమ గింజలు పెట్టి మొలకెత్తిన తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెళ్లి కానీ యువతులు మొలకలెత్తిన బుట్టలను నెత్తిన ఎత్తుకొని ఊరేగించారు. అనంతరం సమీపంలో ఉన్న చెరువుల్లో మొలకల గుట్టలను నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో ఎస్సై శంషుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాం గౌడ్, మాజీ ఎంపీటీసీలు గ్యార లక్ష్మణ్, నరసింహారెడ్డి, యూత్ ప్రెసిడెంట్ ఎరుకలి గణేష్ గౌడ్, యూత్ వైస్ ప్రెసిడెంట్ గోపి నాయక్, ఎన్ ఎస్ యు ఐ గోరేటి శివ, నాయకులు కల్లు సురేందర్ రెడ్డి, మహేందర్ జెసిపి వెంకట్ గౌడ్, కుకుడాల శ్రీనివాసులు, గిరిజన నాయకులు శివరాం నాయక్, జకుడు నాయక్, హరి నాయక్, రామ్ లాల్ నాయక్, నరేష్ నాయక్, సురేష్ నాయక్, వెంకట్ రామ్ నాయక్, హనుమంత్ నాయక్, మహిళలు, యువతి యువకులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు జాతీయ జెండా, జాతీయ నాయకుల ఫోటోల పంపిణీ

**మక్తల్, ఆగస్టు 14 (జనంసాక్షి)**
మక్తల్ మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన బీసీ కాలనీ, జగజ్జీవన్ రామ్ కాలనీ లలో కొత్తగా ఏర్పాటు చేసిన పాఠశాలలకు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండా, జాతీయ నాయకులు మహాత్మ జ్యోతిరావు బాపులే, అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ చిత్ర పటాలను సురక్షా ఫౌండేషన్ ఆధ్వర్యం లో అందజేశారు. కొత్తగా ఏర్పాటు అయిన పాఠశాలలకు జాతీయ నాయకుల చిత్రపటాలను ,జెండా లను అందించడం చాలా ఆనందంగా ఉందని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సురక్ష ఫౌండేషన్ సభ్యులు రాజు, నరేందర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గీత, నందిత, సిఆర్పి సునీత పాల్గొన్నారు.



# ప్రకృతి విపత్తులలో ప్రజల రక్షణకు అన్ని ఏర్పాట్లు



కలెక్టర్ రాహుల్ రాజ్

వరద ప్రవాహక ప్రాంతాల కాజ్వే కల్వర్టు దగ్గర పటిష్ట పోలీస్ భద్రత

జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు

**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనం సాక్షి):** ప్రకృతి విపత్తులలో ప్రజల రక్షణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం హవేలీ ఘన్పూర్ మండలం ధూప్ సింగ్ తండా, పోచారం డ్యామును జిల్లా పాలన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ అప్రమత్తతే శ్రీరామరక్ష సహాయక చర్యల్లో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని ప్రజలెవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని , సుమారు మూడు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ధూప్ సింగ్ తండా లో హై లెవెల్ బ్రిడ్జి పనులు వర్షాబా ప్రభావంతో ప్రస్తుతం ఆగిపోయిన పనులను ప్రారంభించి నిర్మాణం పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితి**

నిర్మానుష్యంగా ఉందని ఎటువంటి ప్రతికూల ప్రభావ పరిస్థితులతో విపత్తుల సంభవించిన సమర్థవంతంగా ఎదుర్కోవడానికి యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరద ప్రవాహ ఉధృతి ఉన్నప్పుడు వాగులు చెరువులు దాటడం చేయరాదని భారీ కేడ్లు ఏర్పాటు చేసి పోలీస్ యంత్రాంగంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. రెవెన్యూ వ్యవసాయ, పోలీస్, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి అధికారులు క్షేత్రస్థాయి లోనే ఉంటూ పరిస్థితులను బేరీజు వేసుకొని సంసిద్ధతలో భాగంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో వరదలకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కొనేందుకు 10 మంది సభ్యులతో 01 ఎస్.డి. ఆర్.ఎఫ్. బృందం జిల్లా అధికారులతో సిద్ధంగా



ఉన్నామని, ప్రజల రక్షణకు కావలసిన పరికరాలు అందుబాటులో పెంచడం జరిగిందని, పోలీసు అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని, ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో వర్షపాత నమోదును దృష్టిలో పెట్టుకుని వర్షాలు సాధారణ స్థాయికి వచ్చేవరకు యంత్రాంగం పనిచేస్తుందని కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో పోలీసు యంత్రాంగం ప్రజలకు రక్షణ కల్పించడంలో సమర్థవంతంగా పనిచేస్తుందని అధిక వర్షాలు వల్ల వాగులు చెరువులు ఉన్న దగ్గర పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎవరిని కూడా ఆ ప్రాంతాలకు వెళ్లకుండా చూస్తున్నామన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని నిరంతరం పర్యవేక్షిస్తున్నామ





న్నారు. జిల్లా కలెక్టర్ ఇతర జిల్లా అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నామని వివరించారు. అనంతరం పోచారం డ్యాం సందర్శించి నీటి ప్రవాహ ఉధృతి నీటిమట్టం వివరాలను తెలుసుకున్నారు. పంచాయతీరాజ్ ఈ.ఈ నరసింహులు, ఇతర పోలీసు అధికారులు సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరేడ్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):**స్వాతంత్ర దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని నారాయ ణపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వతంత్ర దినోత్సవ పరేడ్ ప్రాక్టీస్‌ను శు క్రవారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. పరేడ్ బాగా చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేడుక లకు వచ్చే ప్రజలకు, జిల్లా అధికారులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని, భారీ వర్షాల నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్ లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ పర్యవేక్షణ అధికారి అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్ ఆధ్వరంలో పరేడ్ కమాండర్‌గా, రిజర్వు ఇన్స్పెక్టర్ ఆర్ఐ నరసింహ వ్యవహరించనున్నారు. డిఎస్పీ. ఎన్ లింగయ్య, జిల్లా ఆర్మడ్ రిజర్వు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు టై, బెల్ట్ వితరణ

**వీపనగండ్ల, ఆగస్టు 15( జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విజయ్ కుమార్ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు టై, బెల్ట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహ, పాఠశాల ఎఫ్ఎసి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, శేఖర్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయ్ కుమార్ తల్లిదండ్రులైన రామచంద్రమ్మ, బత్తుల శివన్న జ్ఞాపకార్థం విద్యార్థులకు టై, బెల్టు అందజేయడం అభినందనీయమని అన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి

**శ్రీరంగాపూర్ ఆగస్టు 14( జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని కంబాలాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటస్వామి యాదవ్ చిన్న కుమారుడు సురేష్ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి, మాజీ ఎంపీపీ కీచ్చారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ మాజీ వెంకటేష్ సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్‌లో బిజెపి “ హర్ ఘర్ తిరంగా

- పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్





**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనం సాక్షి):**

జిల్లా కేంద్రంలో 79 వ స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాలల్లో భాగంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణంలో గురువారం “తిరంగా యాత్ర” నిర్వహించారు. ఈ తిరంగా యాత్రలో 300 మీటర్ల జాతీయ జెండాతో మెదక్ పట్టణంలో బిజెపి నాయకులు విద్యార్థిని విద్యార్థులతో కలిసి తిరంగా యాత్రను నిర్వహించారు. అనంతరం మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో, జిల్లాలో ప్రతి గ్రామ గ్రామాన ప్రతి భారతీయ పౌరుడు తమ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరవేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, చోళ రామ్ చరణ్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి నందా రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్, రాష్ట్ర మాజీ కౌన్సిల్ మేంబర్ సుభాష్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు ఎమ్మెల్యేన్ రెడ్డి, శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పెద్ద రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ వెల్మకన్న రాజేందర్, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్లు ఈర్ల రంజిత్ రెడ్డి, అశోక్ సాదుల, మల్లిక,మాజీ కౌన్సిలర్ రమేష్ యాదవ్ మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్ అసెంబ్లీ కన్వీనర్ ఏక్కల దేవి మధుసూదన్ మాజీ పట్టణ అధ్యక్షులు లోకేష్ మెదక్ జిల్లా కౌన్సిల్ మెంబర్ వెలుముల సిద్ధిరాములు, శేఖర్, మెదక్ జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, నాగరాజు మహిళా మోర్చ జిల్లా నాయకులు కవితా రెడ్డి,సంగీత, మౌనిక మెదక్ మండల అధ్యక్షురాలు వీణ పాపన్నపేట మండల అధ్యక్షులు సంతోచారి, హవేలీఘన్పూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రామయంపేట టౌన్ అధ్యక్షుడు అవినాష్, నర్సాపూర్ మండల్ బిజెపి అధ్యక్షులు నీలి నాగేష్ మండల ఉపాధ్యక్షు సంజీవరెడ్డి, రామాయంపేట మాజీ టౌన్ ప్రెసిడెంట్ శంకర్ గౌడ్, మెదక్ కౌన్సిల్ మేంబర్ బక్కవారి శివ, మెదక్ టౌన్ మాజీ ప్రధాన కార్యదర్శి సుంకోజి రాజు, జిల్లా నాయకులు అల్లం మధు, ముక్కా సుధాకర్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ మరియు బానప్ప గారి సుధాకర్ రెడ్డి,జిల్లా నాయకులు ఆకుల రమేష్ చింతల శేఖర్ చిరంజీవి, సత్యనారాయణ గౌడ్, బీజేవైఎం నాయకులు అర్వింద్ వాల్దాస్, శ్యామ్ గౌడ్ మహేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శివ,బిజెపి నాయకులు భాను బబ్లు సన్నీ, సాయి పృధ్వి బొల్లారం సాయి సంతోష్ మెదక్ టౌన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు హవేలీఘన్పూర్ మండలం ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ విష్ణువర్ధన్ పోచయ్య అంకం రమేష్ అంకం శ్రీను సాయి మెదక్ టౌన్ ఉపాధ్యక్షులు ఆకుల రాము, దినేష్ అనిల్ ,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికీ మాజీ ఎమ్మెల్యే పరామర్శ

- ప్రజాక్షేత్రంలోకి మదన్ రెడ్డి



**శివ్వంపేట ఆగస్ట్ 14 జనంసాక్షి :** గుండెకు జరిగిన శాస్త్ర చికిత్స తర్వాత సుమారు నాలుగున్నర నెలలు విశ్రాంతిలో ఉన్న నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుమల మదన్ రెడ్డి మళ్లీ ప్రజాక్షేత్రంలోకి అడుగు పెట్టారు. అందులో భాగంగానే గురువారం ఆయన శివ్వంపేట మండలంలో పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించి తాను అండగా ఉంటానని వారికి మనోస్తైర్యాన్ని కల్పించారు. మండల కేంద్రమైన శివంపేట గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ తల్లి బాలమణి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించింది. పార్టీ శ్రేణుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి గురువారం మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి, ఇతర నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి మనో ధైర్యం కల్పించారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరును ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్, నర్సాపూర్ సొసైటీ చైర్మన్ రాజు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ హబీబ్ ఖాన్, నాయకులు, రవిగౌడ్, కుటుంబ సభ్యులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, కొడకంచి రవీందర్ గౌడ్, కొడకంచి నర్సింలు గౌడ్, కొడకంచి సుదర్శన్ గౌడ్, కొడకంచి గణేష్ గౌడ్ లతో పాటు మండల ముఖ్య నాయకులు ఉన్నారు.

## గలగల గంగమ్మ పరవళ్లు.. రాజగోపురంలో మాత దర్శనం





**పాపన్నపేట, ఆగస్టు 14 (జనంసాక్షి) :** పుడమి సాక్షిగా ప్రకృతి ఒడిలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. భారీ వర్షాల కారణంగా సింగూరు ప్రాజెక్టు నుండి దిగువకు బుధవారం నీటిని విడుదల చేశారు. వనదుర్గా ప్రాజెక్టు నుండి గలగల గంగమ్మ పరవళ్లు తొక్కుతూ దుర్గా మాత ఆలయం ముందు నుండి దిగువకు నిజాంసాగర్ ప్రాజెక్టు వైపు ప్రవహిస్తుంది. దీంతో వనదుర్గమ్మ ఆలయం జలదిగ్బంధంలో ఉంది. ఏడుపాయలలో జలసవ్వడి నెలకొంది. దేవస్థాన సిబ్బంది,అర్చకులు గురువారం గర్భగుడికి తాళం వేశారు. భక్తులు దర్శించుకోవడానికి రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాల లోకి ఎవరూ వెళ్లకుండా సిబ్బంది రాజగోపురం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. వరద ఉదృతి తగ్గిన అనంతరం పున:దర్శనం ఉంటుందని ఆలయ సిబ్బంది తెలిపారు. మెదక్ ఆర్డీవో రమాదేవి స్థానిక తహసీల్దార్ సతీష్ కుమార్, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తో కలిసి వనదుర్గా ప్రాజెక్ట్ ను,ఆలయ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న రోడ్డు దాటే ప్రయత్నం చేయొద్దు

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** ఉదృతంగా ప్రవహిస్తున్న రోడ్డు నుండి పాదచారులు, వాహనాలు దాటే ప్రయత్నం చేయవద్దని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. జిల్లాలో భారీ వర్షాల వల్ల చెరువులు, వాగులు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో కలెక్టర్ గురువారం వనపర్తి మండలం అంకూర్ గ్రామం వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వాగు ఉధృతిని స్వయంగా పరిశీలించారు.

బుద్ధారం కుడి కాలువ పొంగి పొర్లడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు జంగమయ్య పల్లి, బలిజ పల్లి చెరువుల ద్వారా నీటి అలుగు పారి అంకురు వద్ద ఘనపూర్ వనపర్తి రోడ్డుకు అడ్డంగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఉధృతంగా పారుతున్న నీటిని పరిశీలించిన కలెక్టర్ రెండు వైపుల పోలీస్ సిబ్బంది నిలబడాలని, పాదచారులు కానీ, వాహనదారులు కానీ రోడ్డు దాటకుండా రోడ్డు మూసివేసి కాపలా కాయాలని ఆదేశించారు. రోడ్డు పై నుండి ప్రవాహం తగ్గే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ డిఈని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా కాజ్ వేల ద్వారా, రోడ్డుపై నుంచి నీటి ప్రవాహం ఉంటే ప్రజలు రోడ్డు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, ఇరిగేషన్ శాఖ డిఈ ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.





## రోడ్లకు మరమ్మతు చేయించాలి

- తాసిల్దార్‌కు బిజెపి నాయకులు వినతిపత్రం

**మల్దకల్ ఆగస్టు 14(జనంసాక్షి)**
రోడ్లకు వెంటనే మరమ్మతు చేయించాలని మండల కేంద్రంలో గురువారం తహశీల్దార్ ఝాన్సీ రాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నోరోజుల నుంచి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, బురద పెరుక పోయి మరమ్మతులకు నోచుకోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రోడ్లను వెంటనే మరమ్మతు చేయించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో కూడిన యూరియా కావలిసినంత అందు బాటులో సరఫరా చేసిన ఇక్కడ యూరియా అందు బాటులో లేకుండా పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బొటే,మండల ప్రభావి బలిగెర నల్లరెడ్డి,బిజెపి జిల్లా కౌన్సిల్ నెంబర్ ఏవీ రెడ్డప్ప,మాజీ మండల అధ్యక్షుడు రాముడు,దామ వెంకటేష్,కృష్ణారెడ్డి,వాసురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి,తిమ్మప్ప, రంగస్వామి,శివప్రసాద్, వెంకటేష్,తిరుమలేష్, శ్రీను, రవి,గజ్జలన్న,రామకృష్ణ, విజయ్,బలరాం,బూత్ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగరాలి

**రాజోలి, ఆగస్టు 14 (జనంసాక్షి) :**
బీజేపీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షులు కె.శశికుమార్ ఆధ్వర్యంలో గురువారం రాజోలి మండల కేంద్రంలోని వివర్స్ కాలనీలో ప్రతి ఇంటికి జాతీయ జెండాలు పంపిణీ చేశారు. త్రివర్ణ పతాకం తమ ఇళ్లపై ఎగురవేయటం ద్వారా ప్రతిఒక్కరిలో జాతీయభావం పెంపొందుతుందన్నారు. గోవింద్ రాజులు, తిరుమల్లేష్, రాజేష్, అడివిస్వామి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.





## కాకతీయ పాఠశాలలో జన్మాష్టమి వేడుకలు

**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 14 (జనం సాక్షి) :** గద్వాల పట్టణంలోని కాకతీయ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమిని ఉత్సాహంగా, భక్తితో శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో దైవిక జంటను జీవం పోశారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ జోషి, ప్రిన్సిపాల్ సీమ జేమ్స్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. తల్లిదండ్రులు కుండలు పగలగొట్టడం, సాంప్రదాయ నృత్యాలు వంటి సరదా కార్యకలాపాలను జరుపుకున్నారు. వేడుకల్లో మునిగిపోయినప్పుడు పిల్లల ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. ఈ కార్యక్రమం విశిష్టతను గురించి పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ జోషి వివరించారు.

## సరస్వతి ఇంటర్నేషనల్ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 14 (జనం సాక్షి)**
ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఎర్రవల్లి సరస్వతి ఇంటర్నేషనల్ స్కూల్ నందు గురువారము శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల కరస్పాం డెంట్ మధులిక రెడ్డి హాజరై శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను గురించి మాట్లాడుతూ విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు కృష్ణుడి గోపికల వేషధారణలో అందరిని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వీర గోవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ వీర శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మధులిక రెడ్డి, ప్రిన్సిపాల్ నందిని కేని, వైస్ ప్రిన్సిపాల్ మహిమ శ్రీ, అధ్యాపక బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

**ఉర్కొండ ఆగస్టు 14, ( జనం సాక్షి)**
మండల కేంద్రంలో మహిళ మెడలో గొలుసు చోరీ అయినా సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం ఉర్కొండ మండల కేంద్రంలో నివసిస్తున్న ప్రేమలత అనే మహిళ ఇంటికి ఒక గుర్తు తెలియని వ్యక్తి జనాభా లెక్కల కొరకు అని వచ్చి ఇంట్లోకి ప్రవేశించిన వ్యక్తి మంచినీళ్లు అడగగా లోపలికి వెళ్తున్న మహిళ మెడలో నుంచి సుమారు మూడున్నర తులాల పుస్తెలతాడు బంగారు గొలుసును అపహరించుకొని వెళ్లినట్టు కూతురు మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై కృష్ణదేవ తెలియజేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్

**చిన్న శంకరంపేట్ ఆగస్టు 14 (జనం సాక్షి)**
బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుమ్మరి ముత్తయ్య కుమార్తె వివాహానికి గురువారం హాజరై నూతన వధూవరులను మెదక్ జిల్లా బిఆర్‌యస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు లక్ష్మారెడ్డి, శంకరంపేట్ మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, ఏమా చంద్రం, ఏమా దుర్గపతి, ఏమా వెంకట్, ఆకుల శ్రీను, బొట్టు యాదగిరి సుంకరి వెంకట్, బైండ్ల రాజ్ కుమార్, ఇమ్మడి నరేష్, సురేష్ నాయక్, సుజిత్, చాకలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

